# పాలకుర్తి వాణి

మన పల్లె.. మన ముచ్చట్లు

సంపుటి : 01 | సంచిక : 250 | వరంగల్ | శుక్రవారం, 03 జులై 2026 | పేజీలు : 02


## ఎమ్మెల్యేను కలిసిన ఆర్డీవో కిరణ్ ప్రకాష్

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** ఇటీవల స్టేషన్ ఘన్‌పూర్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) గా బాధ్యతలు స్వీకరించిన కిరణ్ ప్రకాష్ పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి నూతన ఆర్డీవో కిరణ్ ప్రకాష్ కి అభినందనలు తెలిపారు.







# కూలీలతో కలిసి ఎమ్మెల్యే వరి నాట్లు

**దేవరుప్పల, పాలకుర్తి వాణి:** ప్రజల మధ్య ఉండడమే ప్రజా ప్రతినిధి ధ్యేయమనే విషయాన్ని మరోసారి చాటిచెబుతూ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి దేవరుప్పుల మండలం మాదాపురంలో మహిళా వ్యవసాయ కూలీలతో కలిసి వరి నాట్లు వేశారు. అధికారిక కార్యక్రమాలు ముగించుకుని తిరిగి వస్తుండగా, మార్గమధ్యంలో పొలంలో మహిళా కూలీలు వరి నాట్లు వేస్తుండటం గమనించిన ఎమ్మెల్యే వెంటనే వారి వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న అనంతరం, కొంతసేపు వారితో కలిసి స్వయంగా వరి నాట్లు వేస్తూ వ్యవసాయ పనిలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే తమతో కలిసి పొలంలోకి దిగి నాట్లు వేయడంతో మహిళా కూలీలు ఆనందం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధి తమ మధ్యకు వచ్చి తమ కష్టాన్ని పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు, వ్యవసాయ కూలీలే దేశానికి అన్నదాతలని అన్నారు. రైతులు, కూలీల శ్రమ వల్లే ప్రతి ఇంటికి అన్నం చేరుతుందని, వారి కష్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడం, రైతులు, వ్యవసాయ కూలీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.



## రేవంత్ రెడ్డి 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానం..

### 4న కృతజ్ఞత సభ

**పాలకుర్తి వాణి, హైదరాబాద్ :** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తన రాజకీయ ప్రస్థానం 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తనకు రాజకీయంగా జన్మనిచ్చిన మహబూబ్ నగర్ జిల్లా మిడ్జిల్ మండలం రుణం తీర్చుకోవాలని సంకల్పించారు. జులై 4న మిడ్జిల్‌లో కృతజ్ఞత సభ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మిడ్జిల్ సమీపంలో గోపాల్‌రెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించి, బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. 2006లో మిడ్జిల్ జెడ్పీటీసీగా తొలి విజయం సాధించిన రేవంత్‌రెడ్డి, ఆ తర్వాత ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీగా ఎదిగి, ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

**పాలకుర్తి వాణి, కొడకండ్ల :** కొడకండ్ల మండలంలోని రెండు గ్రామాల్లో ఇటీవల కుటుంబ పెద్దలను కోల్పోయిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పరామర్శించారు. కొడకండ్ల మండలం రంగాపురం గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు యాకేష్ యాదవ్ నానమ్మ ఇటీవల మృతిచెందిన నేపథ్యంలో వారి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించి, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మండలంలోని రామవరం గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే , మాజీ వార్డు సభ్యులు తోట మురళి తల్లి ఇటీవల మృతిచెందిన నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.





## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

పాలకుర్తి వాణి, దేవరుప్పుల : జనగాం జిల్లా దేవరుప్పుల మండలం మాదాపురం గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ శ్రీనాథ్ నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేద మంత్రోచ్చారణల నడుమ నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని, నూతన గృహాన్ని ప్రారంభించారు.ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శ్రీనాథ్ , వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇంటిలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

## జర్నలిస్టు లక్ష్మణ్ కుటుంబాన్ని ఆదుకుంటాం

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** జనగామ జిల్లా పాలకుర్తి మండలం సీనియర్ రిపోర్టర్ రాపోలు లక్ష్మణ్ గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకొని వారి ఇంటికి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి వెళ్లి రాపోలు లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా కల్పించారు.





# చదువే భవిష్యత్తుకు బలమైన పునాది

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**పాలకుర్తి టౌన్, పాలకుర్తి వాణి:** చదువే భవిష్యత్తుకు బలమైన పునాది అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గురువారం పాలకుర్తిలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు, బోధనా విధానం, వసతి సౌకర్యాలు, పారిశుద్ధ్యం, మధ్యాహ్న భోజనం వంటి వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. కలెక్టర్ విద్యార్థులతో ఇంగ్లీష్ పాఠ్యాంశాలను చదివించి, వారి పఠన సామర్థ్యాన్ని పరీక్షించారు. ప్రతి విద్యార్థి స్పష్టంగా చదవగలిగేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఉపాధ్యాయులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. అకడమిక్ ఫ్రేమ్‌వర్క్‌కు అనుగుణంగా బోధన సాగించాలని, ప్రతి అంశాన్ని కాన్సెప్ట్ ఆధారంగా వివరించాలని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న టూల్ కిట్ ప్రకారం ప్రతి 15 రోజులకు పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించి, విద్యార్థుల పురోగతిని అంచనా వేయాలని సూచించారు. పాఠశాలలో వైద్య సేవలను పరిశీలిస్తూ ఏఎన్ఎం నీరజతో మాట్లాడి, మందుల నిల్వలు, ఐ డ్రాప్స్ అందుబాటులో ఉన్నాయా? అని తెలుసుకున్నారు. విద్యా శాఖ ఏడీ శ్రీనివాస్, తహసీల్దార్ సరస్వతి, ఎంపిడిఓ వేదవతి, ఎంఈవో, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

**ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా..**

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (SIR) ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. పాలకుర్తి మండల కేంద్రంలోని శాంతి నగర్ లో నిర్వహిస్తోన్న ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారులు (BLOలు) చేపడుతోన్న ఇంటింటి సర్వేను ప్రత్యక్షంగా పర్యవేక్షించి, ఓటర్లతో మాట్లాడారు.







# బస్సు ధ్వంసం కేసు కొట్టివేత

## కాంగ్రెస్ నాయకులకు ఊరట

పాలకుర్తి వాణి, పాలకుర్తి : ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కాంగ్రెస్ ప్రతిపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో నమోదైన బస్సు ధ్వంసం కేసును కోర్టు కొట్టివేసింది.దివంగత మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దుగ్యాల శ్రీనివాసరావు నాయకత్వంలో 2015 అక్టోబర్ 10న జనగాం జిల్లా పాలకుర్తి గుడివాడ చౌరస్తాలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.ధర్నా సందర్భంగా ఆర్టీసీ బస్సు పై ఆందోళనకారులు దాడులు చేయడంతో బస్సు ధ్వంసం అయింది. దీంతో బస్సు డ్రైవర్ కొత్తపల్లి రవీందర్ ఫిర్యాదు మేరకు పాలకుర్తి ఎస్ఐ ఉస్మాన్ షరీఫ్ కేసు నమోదు చేశారు.మాజీ ఎమ్మెల్యే దుగ్యాల శ్రీనివాసరావుతో పాటు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ,మాజీ మండల పార్టీ అధ్యక్షులు గిరగాని కుమారస్వామి గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు పోగు శ్రీనివాస్, EX ZPTC బన్నెపాక గణేష్, దేవస్థానం మాజీ చైర్మన్ చిలువేరు కృష్ణమూర్తి, మాజీ ఎంపీపీ కారుపోతుల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు కోట వెంకటేశ్వర్లు, సలేంద్ర వెంకన్న, పసునూరి నవీన్, గుగ్గిళ్ళ ఆదినారాయణ, ధరావత్ బాలు, ఎండి సలీం,గుగులోతు కిషన్ నాయక్ లపై కేసు నమోదు చేశారు.2015 నుంచి ఇప్పటివరకు వివిధ కోర్టులో విచారణ జరగగా గురువారం హనుమకొండ కోర్టులో కేసును కొట్టివేశారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకులకు భారీ ఊరట లభించింది. కేసు నమోదైన వారిలో మాజీ ఎమ్మెల్యే దుగ్యాల శ్రీనివాసరావు, కోట వెంకటేశ్వర్లు మృతి చెందారు.

# సోమనాథునికి నివాళులు




**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** తెలుగులో ద్విపద కావ్యాల ద్వారా దివ్యమైన రచనలు చేసిన మహాకవి పాల్కురికి సోమనాథుడని సాహితీవేత్త డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్ అన్నారు. గురువారం నాడు ఆయన కర్ణాటక రాష్ట్రంలోని కల్య క్షేత్రంలో నెలకొని ఉన్న పాల్కురికి సోమనాథుని సమాధిని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రాంతి పురుషుడైన బసవేశ్వరుని భావాలను తెలుగు నాట విస్తృతంగా ప్రచారం చేసిన సోమనాథుడు తన అవసాన కాలంలో ప్రఖ్యాతి చెందిన శివశరణి చెన్నమ్మ దర్శనం కోసం కల్య క్షేత్రానికి వెళ్లి అక్కడే శివసాయుజ్యం పొందాడు. దాంతో భక్తులు ఆయనకు అక్కడే సమాధిని ఏర్పాటు చేశారు. బెంగళూరుకు 50 కిలోమీటర్ల దూరంలోని మాగడి తాలూకా కల్య గ్రామంలో ఉన్న కొండపై కల్లేశ్వర స్వామి దేవాలయం, శివ భక్తురాలు చెన్నమ్మ నివసించిన గుహ, ఆమె సమాధి, అలాగే పాల్కురికి సోమనాథుని సమాధి ఉన్నాయి. అయితే ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఆ మహాకవి సమాధి చుట్టూ గడ్డి, గాసం పెరిగి అనాదరంగా ఉందని పాలకవర్గాలు ఇప్పటికైనా కళ్ళు తెరచి దానిని పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో తెలంగాణ కర్ణాటక రాష్ట్రాల దేవదాయ, సాంస్కృతిక మరియు పర్యాటక శాఖలు సమన్వయంతో వ్యవహరించి కల్య క్షేత్రాన్ని అభివృద్ధి పరచాల్సిన అవసరం ఉందని శంకరమంచి శ్యాం ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన కల్య క్షేత్రంలోని పాల్కురికి సోమనాథుని సమాధికి పూలమాలలను సమర్పించి ఆయన సాహిత్య సేవను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కల్య వాస్తవ్యులు శ్రీ ఈశ్వర ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు. చాలా కాలానికి ఆ మహాకవి సమాధిని సందర్శించి నివాళులర్పించడం పాలకుర్తి వాసిగా తనకు మంచి అనుభూతిని కలిగించిందని శ్యాంప్రసాద్ చెప్పారు. కల్య క్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దినట్లైతే ఇటు భక్తులు అటు పర్యాటకులు పెరిగే అవకాశం ఉందని ఆయన చెప్పారు.

# సమస్యల పరిష్కారానికి పాలకుర్తి గ్రామపంచాయతీ పాలకవర్గం చొరవ

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** ఎన్నికల సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పట్ల ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి చొరవ చూపుతామని ఇచ్చిన హామీల మేరకు పాలకుర్తి గ్రామపంచాయతీ పాలకవర్గం శ్రీకారం చుట్టారు. పాలకుర్తి మండల కేంద్రంలోని సోమేశ్వర ఫంక్షన్ హాల్ వెనకాల గత దశాబ్ద కాలం నుంచి పెరిగిన ముళ్ళకంప చెట్లు తో చుట్టుపక్కల ఇంటి నివాసం ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా వారి సంక్షేమమే తమ ధ్యేయమని పాలకుర్తి సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న గౌడ్, ఉప సర్పంచ్ గాదపాక కిరణ్, వార్డు సభ్యులు కమ్మగాని సుధాకర్ గౌడ్, సలేంద్ర రమా సోమన్న ప్రత్యేక దృష్టి పెట్టి ముళ్ళకంపలను జెసిబి సహాయంతో తొలగించారు. పంచాయతీ కార్యదర్శి రుబీనా సుల్తానా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. పాలకుర్తి గ్రామపంచాయతీ సర్పంచ్ ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు అధికారం యంత్రాంగం పాలనపై పారదర్శకంగా ముందుకు వెళ్తున్నట్టు కాలినివాసులు పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని కోరుతున్నారు.





# వీధి దీపాలు వెలగక పట్టణ వాసుల ఇబ్బందులు

**పాలకుర్తి టౌన్, పాలకుర్తి వాణి:** జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో డివైడర్ల మధ్యన కొలువైన హైమాస్ట్ వీధిదీపాలలో పలు దీపాలు వెలగక పాలకుర్తి పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. చౌరస్తా నుంచి నలువైపులా చాలా వరకు దీపాలు వెలుగుతున్న అక్కడక్కడ కొన్ని దీపాలు మాత్రం వెలగడం లేదు. గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ఆయా ప్రాంతంలోని స్థానికులు తమ నివాసాల ఎదుట దారి కనిపించక ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు సైతం అవస్థలు ఎదుర్కొంటున్నారు. వెంటనే పూర్తిస్థాయిలో అన్ని దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని పాలకుర్తి వాసులు కోరుతున్నారు.


Printed and Published by **DHEERAVATH SREENU NAIK** on behalf of DHEERAVATH SREENU NAIK, Printed at SHASHI PRINTING PRESS Flat No.58675/9/6, Ashok Nagar, Kamareddy, Tela gana, 503111., Published at 4-109/3, Palakurthy, Jangaon District. Telangana , 506252, editor DHEERAVATH SREENU NAIK. Ph : **9866366702**, RNI: TGTEL/25/A2341